సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం ; 24 ; జనవరి ; 2025



'ప్రాక్టికల్స్'పై నిఘా

ఇంటర్ వార్షిక పరీక్షలతోపాటు ప్రాక్టికల్ పరీక్షలు కూడా పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు. IIలో



రసాభాసగా గ్రామసభ

టేకులపల్లి మండలం తొమ్మిదోమైలుతండా గ్రామసభ రసాభాసగా మారింది. ఎమ్మెల్యే సమక్షంలోనే తోపులాట జరిగింది. IIలో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
33° / 16°

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయి. తెల్లవారుజామున చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నివేదన, హారతి సమర్పించి మంత్రపుష్పం పఠించారు.కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా కేటీపీఎస్



హాకీలో గెలుపొందిన జట్టుకు బహుమతి అందిస్తున్న జెన్‌కో డైరెక్టర్

పాల్వంచ: టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ బాస్కెట్‌బాల్, హాకీ టోర్నమెంట్‌లో ఓవరాల్ చాంపియన్‌గా కేటీపీఎస్ 5, 6 దశల జట్లు నిలిచాయి. గత మూడు రోజులుగా స్థానిక విద్యుత్ కళాభారతి క్రీడా మైదానంలో జరుగుతున్న పోటీలు గురువారం ముగిశాయి. బాస్కెట్ బాల్‌లో కేటీపీఎస్ 7వ దశపై కేటీపీఎస్ 5, 6 దశల జట్టు 44–22 తేడాతో గెలుపొందింది. హాకీలో భూపాలపల్లి జట్టుపై 2–0 గోల్స్ తేడాతో కేటీపీఎస్ 5,6 దశల జట్టు గెలుపొందింది. విజేతలకు జెన్‌కో డైరెక్టర్(థర్మల్) బి.లక్ష్మయ్య బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో కేటీపీఎస్ కాంప్లెక్స్ సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్ రావు, శ్రీనివాసబాబు, ఎస్ఈ మోక్షవీర్, జెన్‌కో స్పోర్ట్స్ ఆఫీసర్ లోహిత్ ఆనంద్, గేమ్స్ సెక్రటరీ వీరస్వామి, వైటీఎంకే.రాజు, కట్టా శ్రీదర్, బరగడి రామారావు, తోట అనిల్, రిఫరీలు ఇలియాజ్, ఆరీఫ్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ముందడుగు



విమానాశ్రయ స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్తున్న ఏఏఐ బృందం సభ్యులు

జిల్లాలో పర్యటించిన ఏఏఐ బృందం

- ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన సభ్యులు
- విమానాశ్రయ ఏర్పాటు ఆవశ్యకతను వివరించిన ఎంపీ, కలెక్టర్
- జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్న ఎమ్మెల్యే

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా వాసుల చిరకాల వాంఛ అయిన విమానాశ్రయ ఏర్పాటుకు ముందడుగు పడింది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు ఏరో ప్లానింగ్ అధికారి అబ్దుల్ అజీజ్, ఆర్కిటెక్చర్ మహమ్మద్ సాకిబ్, ఆపరేషన్స్ అధికారి ప్రశాంత్ గుప్తా, సీఎన్ఎస్ ఆర్.దివాకర్, ఇంజనీరింగ్ అధికారులు మనీష్ జోస్వాల్, ప్రవీణ్ ఉన్ని కృష్ణన్ గురువారం కొత్తగూడెంలో పర్యటించారు. రామవరం సమీపంలోని గరీబ్‌పేట, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల పరిధిలోని 950 ఎకరాల భూమిని సభ్యులు పరిశీలించారు. అక్కడున్న వనరులు, రహదారులు ఎలా ఉన్నాయి.. గుట్టలేమైనా ఉన్నాయా, ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సాధ్యాసాధ్యాలు ఎలా ఉన్నాయని తనిఖీ చేశారు. వ్యూ పాయింట్ ద్వారా స్థలాన్ని ఫొటోలు తీశారు. అనంతరం ఐడీఓసీలో జిల్లా అధికారులతో వారు సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.. కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటు ఆవశ్యకతను బృందం సభ్యులకు వివరించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంతో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సరిహద్దులో ఉంటాయని, కొత్తగూడెంలో విమానాశ్రయం నిర్మిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దర్శనానికి దేశంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారని, జిల్లాలోని సింగరేణి బొగ్గు గనులు, కేటీపీఎస్, బీటీపీఎస్, నవభారత్, ఐటీసీ వంటి పరిశ్రమలకు పలు ప్రాంతాల నుంచి వస్తుంటారని, ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో వీరందరికీ రాకపోకలు సులువవుతాయని వివరించారు. ఇప్పటికే కిన్నెరసానిలో జింకల పార్కు ఉందని, పాపికొండల పర్యాటకానికి కూడా ఎక్కువ మంది జిల్లామీదుగానే వెళ్తుంటారని చెప్పారు. ఇక విమానాశ్రయం నిర్మిస్తే పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. స్థల పరిశీలన నివేదికలను త్వరితగతిన పూర్తిచేసి, ప్రభుత్వానికి సమర్పించాలని కోరారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం...

విమానాశ్రయ ఏర్పాటుకు కొత్తగూడెంలోని భౌగోళిక పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని బృందం సభ్యులు ప్రకటించారు. తాము నిర్వహించిన సర్వే, చేపట్టిన పరిశీలన వివరాలను కేంద్రానికి సమర్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా అధికారులు సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ఆర్డీఓ మధు, సీపీఓ సంజీవరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం, సుజాతనగర్ తహసీల్దార్లు పుల్లయ్య, శిరీష, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, టూ టౌన్ సీఐ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందంజ..

తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అన్ని రంగాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ముందంజలో ఉందని ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని ఏఏఐ బృందం సభ్యులకు వివరించారు. ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తే జాతీయ, అంతర్జాతీయ వ్యాపార ప్రముఖులు కూడా ఇక్కడికి వచ్చే అవకాశం ఉంటుందని, తద్వారా జిల్లా మరింతగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం జిల్లా భౌగోళిక స్వరూపాన్ని మ్యాప్ ద్వారా కలెక్టర్ పాటిల్ వివరించారు.

లోక్‌సభలో లేవనెత్తిన ఎంపీ

కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి చేసిన కృషి ఫలించనుంది. ఢిల్లీ నుండి వచ్చిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) బృందం సభ్యులు సర్వే అనంతరం విమానాశ్రయం ఏర్పాటుకు అనుకూలంగా ఉందని ప్రకటించారు. గతేడాది జూలైలో 377 నిబంధన కింద ఈ అంశాన్ని ఎంపీ లోక్‌సభలో లేవనెత్తారు. దీనికి కేంద్ర విమానయాన మంత్రి కింజారావు రామ్మోహన్‌నాయుడు సానుకూలంగా స్పందిస్తూ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీల బృందంతో కేంద్రమంత్రిని కలిశారు. సర్వే నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 38 లక్షలు కేటాయించారు.



సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



బృందం సభ్యులతో ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఆ 'ఐదు' ఏమాయె..



భద్రాచలం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న విలీన పంచాయతీల ప్రజలు (ఫైల్)

- ఎటూ తేలని విలీన పంచాయతీల సమస్య
- తిరిగి తెలంగాణలో కలపాలని ఏళ్లుగా డిమాండ్
- సీఎంలు సానుకూలంగా స్పందించినా తెగని పంచాయితీ
- ఏపీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్

భద్రాచలం : రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీలో విలీనమైన ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని ఆయా గ్రామాల వారు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా వారి గోడుకు తెర పడటం లేదు. సుదూరంగా ఉన్న జిల్లా కేంద్రానికి వెళ్లలేక పోతున్నామని, భౌగోళికంగా తెలంగాణతో ముడి పడి ఉన్న తమను తెలంగాణాలోనే కలిసి ఉంచాలనే వారి విన్నపాలు కన్నీటి సంద్రమవుతున్నాయి. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో దీనిపై చర్చించాలని నిర్ణయించినా ఇప్పటి వరకు ఒక్క అడుగు ముందుకు పడలేదు.

సీఎంల భేటీలో ప్రస్తావన..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజన నాటి నుంచి జరుగుతున్న పరిణామాలు, ఆయా గ్రామాల వారు ఏపీలో ఉండేందుకు చూపుతున్న విముఖతతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై ప్రధానంగా స్పందించారు. జిల్లాకు చెందిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి సైతం తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో గత జూలైలో హైదరాబాద్‌లో జరిగిన ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీలో ఈ అంశం ప్రాథమికంగా చర్చకు వచ్చింది. దీనిపై ఇరు రాష్ట్రాల అధికారులు పరిశీలించి సమస్యపై దృష్టి సారించాలని నిర్ణయించారు. అయితే ఇది జరిగి ఆరు నెలలు దాటినా ఇప్పటి వరకు కనీసం ఒక్క అడుగు సైతం ముందుకు పడలేదు. దీనికి తోడు ఇటీవల అమరావతిలో జరిగిన ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారుల సమావేశంలో కనీసం ప్రస్తావనకు కూడా రాలేదు.

వినతులు, ఉద్యమాలు..

తెలంగాణ, ఏపీ రాష్ట్ర విభజనకు ముందు భద్రాచలం డివిజన్‌లో యటపాక, పురుషోత్తపట్నం, గుండాల, పిచుకలపాడు, కన్నాయిగూడెం పంచాయతీలు అంతర్భాగంగా ఉండేవి. రాష్ట్ర విభజనతో పోలవరం ముంపు పేరుతో ఈ ఐదు పంచాయతీలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. అయితే తిరిగి తమ గ్రామాలను ఏపీలో కలపాలని కోరుతూ ఆయా గ్రామాల వారు పదేళ్లుగా రాస్తారోకోలు, మానవహారాలు, బంద్‌లు చేపట్టారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులే కాక గవర్నర్, రాష్ట్రపతికి సైతం వినతిపత్రాలు సమర్పించారు. విద్యార్థుల ఉన్నత చదువులకు, రెవెన్యూ, తదితర పనుల కోసం సుదూరంగా ఉన్న జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బంది కలుగుతోందని, గోదావరి వరదల సమయంలోనూ సత్వర సహాయక చర్యలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భద్రాచలం అభివృద్ధికి ఇదే ప్రత్యామ్నాయం..

రాష్ట్ర విభజన అనంతరం భద్రాచలంలో తగినంత స్థలం లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. రామాలయ అభివృద్ధితో పాటుగా ప్రజా సంక్షేమ పథకాల అమలుకు ఈ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న భద్రాచలంలో జనాభా సైతం నానాటికి పెరుగుతోంది. దీనికి అనుగుణంగా వసతులు, స్థలాలు లేకపోవడంతో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రులు, ఈ ప్రాంత ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఏపీ ప్రభుత్వం స్పందించాలి



ఏపీలో కలిసిన ఐదు పంచాయతీల ప్రజల సమస్య పట్ల ఏపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. ఇరు రాష్ట్రాలు దీనిపై దృష్టి సారించాలి. ఆయా గ్రామాల వారి ఆవేదనను అర్థం చేసుకోవాలి. భద్రాచలం అభివృద్ధికి సైతం ఇదే ప్రధాన అడ్డంకిగా ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం ఏపీపై ఒత్తిడి పెంచాలి.

– ఆకోజు సునీల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, భద్రాచలం

జిల్లా స్థాయి పోటీల్లో సత్తా



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

సూపర్‌బజార్(కొత్తగూడెం)/చర్ల/దమ్మపేట : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 150 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రతిభ చాటారు. సీనియర్ విభాగం వక్తృత్వ పోటీలో భద్రాచలం బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎం.లలిత, నారాయణపురం విద్యార్థి వై.డింపు, పాత కొత్తగూడేనికి చెందిన ఎండీ. జైనాబ్, జూనియర్స్ విభాగంలో భద్రాచలంలోని కొత్తరాజులగుట్ట బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కె.భాగ్యశ్రీ, పాల్వంచ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.కుందన్‌కుమార్, చర్ల మండలం తేగడ పాఠశాల విద్యార్థిని పి.అక్షిత ప్రతభ కనబర్చారు. చిత్రలేఖనం సీనియర్స్ విభాగంలో పాల్వంచ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎస్‌కే సోఫియా బర్కత్, అశ్వాపురం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఆర్.సంధ్య, జగన్నాథపురం పాఠశాల విద్యార్థి ఏసుమణి విజేతలుగా నిలిచారు. జూనియర్స్ విభాగంలో అశ్వారావుపేట జవహర్ విద్యాలయానికి చెందిన ఎల్.అశ్విత, జగన్నాథపురం విద్యార్థిని ఎల్.స్రవంతి, దమ్మపేట మండలం పట్వారిగూడెం విద్యార్థిని కె.వర్షిత ప్రతిభ చాటారు. వ్యాసరచన సీనియర్స్ విభాగంలో భద్రాచలం పాఠశాల విద్యార్థి జి.హర్షవర్ధన్, పాల్వంచకు చెందిన ఎస్.చరణ్, తేగడ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్‌డీ ఖైరున్నీసా విజేతలుగా నిలిచారు. జూనియర్స్‌లో పాల్వంచ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎం.చైత్ర, పాల్వంచలోకి కరకవాగు పాఠశాలకు చెందిన బి.అనన్య, అశ్వారావుపేట జవహర్ విద్యాలయానికి చెందిన ఎల్.అశ్వితసాయి విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో డీఈఓ ఎం. వెంకటేశ్వరాచారి, ఎలక్షన్ సెల్ తహసీల్దార్లు దారా ప్రసాద్, రంగాప్రసాద్, డీఎల్ఎంటీ పూసపాటి సాయికృష్ణ, నవీన్, అశోక్ పాల్గొనగా న్యాయ నిర్ణేతలుగా శ్రీనివాస్, శైలజ, కృష్ణమోహన్, రమేష్, వరలక్ష్మి, సుశాంత్, అర్జున్, రాము వ్యవహరించారు.

పర్యాటకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు

- ట్రైబల్ మ్యూజియం వద్ద క్రీడా పరికరాలు, బోటింగ్
- పరిశీలించిన ఐటీడీఏ పీఓ రాహుల్



మ్యూజియం వద్ద ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయ ఆవరణలోని ట్రైబల్ మ్యూజియం సందర్శనకు వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా మరిన్ని ఏర్పాట్లు చేయాలని పీఓ బి.రాహుల్ సూచించారు. బోటింగ్‌తో పాటు చిన్న పిల్లలు ఆడుకునేలా పరికరాలు సమకూర్చాలని తెలిపారు. ట్రైబల్ మ్యూజియం వద్ద క్రీడా స్థలాల ఏర్పాటు, బోటింగ్ కోసం రూపొందిస్తున్న కృత్రిమ చెరువు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మ్యూజియం సందర్శనకు వచ్చే వారి పిల్లలకు ఆటవిడుపుగా బోటింగ్ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ మేరకు పనులను ఫిబ్రవరి 5 నాటికి పూర్తిచేసి, పాతకాలపు మాదిరి ఇళ్లపై బొమ్మలు, మ్యూజియం ముందు ఫౌంటెయిన్ ఏర్పాటు చేయాలని సూచించారు.

క్రికెట్ బాక్స్ ఏర్పాటు..

మ్యూజియం ఆవరణలో క్రికెట్ బాక్స్ ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ రాహుల్ తెలిపారు. ఆసక్తి గల వారు ఐటీడీఏలోని భవిత కేంద్రంలో ఈనెల 27వ తేదీ సాయంత్రం లోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, అధికారులు శ్రీనివాస్, హరికృష్ణ, శ్రీనివాస్, మహేష్, వీరస్వామి పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి చేయూత..

గిరిజన మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం తరఫున ఐటీడీఏ చేయూతనిస్తోందని పీఓ రాహుల్ తెలిపారు. ఎంఎస్ఎంఈ పథకం ద్వారా మగ్గం కేంద్రం సొసైటీ సభ్యురాలు నాగమణికి రూ.2.12 లక్షల సబ్సిడీ చెక్కును అందజేసి ఆయన మాట్లాడారు. యూనిట్ ధర రూ.27.70లక్షల్లో సొసైటీ సభ్యులు చెల్లించిన మొత్తం పోగా బ్యాంకు రుణం, అందులో సబ్సిడీ వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ పాల్గొన్నారు.

జాబితాలో పేరు లేదని ఆందోళన చెందొద్దు

భద్రాచలంఅర్బన్ : సంక్షేమ పథకాల జాబితాల్లో పేర్లు లేని వారు ఆందోళన చెందొద్దని పీఓ రాహుల్ సూచించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న నాలుగు పథకాలు అర్హులందరికీ అందుతాయని, ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకే గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుత జాబితాలో పేరు లేని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.8.50 కోట్ల లాభాల్లో డీసీసీబీ

- కౌలు రైతులకూ పంట రుణాలు ఇచ్చేందుకు కృషి
- డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరరావు, పక్కన సీఈఓ వెంకటఆదిత్య

ఖమ్మంవ్యవసాయం: వ్యాపారాలు, డిపాజిట్లు, రుణ లావాదేవీలతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఆర్థికంగా బలోపేతమవుతూనే లాభాలు గడిస్తోందని చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన సీఈఓ ఎన్.వెంకటఆదిత్యతో కలిసి బ్యాంకు ప్రగతిని వెల్లడించారు. 2024 మార్చి నాటికి రూ.2,984 కోట్ల లావాదేవీలతో ఉన్న బ్యాంకు డిసెంబర్ 31 నాటికి ఏకంగా రూ. 3,391 కోట్లకు పెరిగిందని తెలిపారు. వ్యాపార పరంగా రూ.1,144 కోట్ల నుంచి రూ.1,247 కోట్లకు, పంట రుణాలు రూ.1,840 కోట్ల నుంచి రూ.2,143 కోట్లకు పెరిగాయని వివరించారు. తద్వారా లావాదేవీలు రూ.406 కోట్ల మేర పెరగగా, 2024 మార్చి నాటికి రూ.3.90 కోట్ల లాభాల్లో ఉన్న బ్యాంకు డిసెంబర్ 31నాటికి రూ.8.50 కోట్లకు చేరిందని తెలిపారు. డీసీసీబీ ద్వారా 1.69 లక్షల మంది రైతులకు రూ.900కోట్ల మేర రుణమాఫీకి సిఫారసు చేస్తే 92 వేల మందిని అర్హులుగా గుర్తించారన్నారు. ఇందులో 77,750 మంది రైతులకు చెందిన రూ.326 కోట్లు మాఫీ వర్తించిందని తెలిపారు. మిగిలిన రైతులు ఇతర బ్యాంకుల్లో రుణాలు కలిగి ఉండటంతో డీసీసీబీ నుంచి మాఫీ వర్తించలేదని చైర్మన్ చెప్పారు.

రూ.2 లక్షల ప్రమాద బీమా

బ్యాంకు ద్వారా రైతు సేవలో భాగంగా ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు చైర్మన్ వివరించారు. ఏటా రూ.14 ప్రీమియంతో రూ.2లక్షల బీమా వర్తిస్తుందని, ఈ ప్రీమియం కూడా బ్యాంకే చెల్లిస్తుందని తెలిపారు. గతంలో రూ.19తో ఉన్న ప్రీమియాన్ని ఈ ఏడాది రూ.14కు తగ్గించామన్నారు. గత ఏడాది 1.27 లక్షల మంది రైతుల కుటుంబాలకు ఈ పథకం ద్వారా రూ.24.18 లక్షలు అందగా, ఈ ఏడాది 1.20 లక్షల మంది కుటుంబాలకు రూ.16.70 లక్షలు చెల్లించామని ఆయన వివరించారు.

గ్యారంటీ ఇస్తే వారికీ రుణాలు

భూమి లేని కౌలు రైతులకూ పంట రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని చైర్మన్ వెంకటేశ్వరరావు తెలిపారు. పీఏసీఎస్‌ల చైర్మన్లు, సర్పంచ్‌లు గ్యారంటీ ఇస్తే రుణాలు ఇచ్చేందుకు ఆలోచనలో ఉన్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మార్ట్‌గేజ్ సమస్య అడ్డుగా ఉందని తెలిపారు. కాగా, పాడి గేదెలు, చేపల పెంపకం, కోళ్ల పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లకు నాబార్డ్ సహకారంతో రుణాలు ఇచ్చేందుకు కృషి జరుగుతోందని చెప్పారు.

సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న రామచంద్ర ప్రసాద్

దమ్మపేట : ఆయిల్‌ఫెడ్ అధికారులు సమన్వయంతో, రైతులకు మేలు చేసేలా పనిచేయాలని ఆయిల్ ఫెడ్ సలహా మండలి సభ్యుడు అలపాటి రామచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని అల్లిపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయిల్ ఫెడ్ అధికారుల పనితీరు రైతుల పాలిట శాపంలా మారేలా ఉందన్నారు. సత్తుపల్లి మండల పరిధిలోని రేగళ్లపాడు నర్సరీలో అధికారుల నిర్లక్ష్యం, సమన్వయ లోపంతో మొక్కలు సాగుకు పనికిరాకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. ఆయిల్ ఫెడ్‌లో సమస్యలు ఉంటే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఆయన వెంట పామాయిల్ రైతు సంఘం నాయకులు సీతారామస్వామి, శీమకుర్తి వెంకటేశ్వరరావు, కేవీ, కొయ్యల అచ్యుతరావు, సోయం ప్రసాద్, కాసాని నాగప్రసాద్, జూపల్లి రమణారావు, ఎర్రా వసంతరావు, బుద్దే కోటేశ్వరరావు ఉన్నారు.

క్లుప్తంగా

సమయపాలన పాటించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఎల్.భాస్కర్ నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంధ్య, హెల్త్ సూపర్‌వైజర్ రామచందర్, సిబ్బంది లక్ష్మి, ప్రియ రజిని తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ విత్తన కంపెనీపై చర్యలు తీసుకోవాలి


అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌ఫెడ్ సంస్థకు నాసిరకం పామాయిల్ విత్తనాలు సరఫరా చేసిన విత్తన కంపెనీపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆయిల్ పామ్ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేగళ్లపాడు నర్సరీలో పెంచిన పామాయిల్ మొక్కలన్నీ తక్షణమే ధ్వంసం చేయాలని, ఈ మొక్కలకు ఆయిల్‌ఫెడ్ సంస్థ పెట్టిన మొత్తం ఖర్చును విత్తన కంపెనీ నుంచి రికవరీ చేయాలని కోరారు. రైతులకు పంపిణీ చేసిన ఆఫ్‌టైప్ మొక్కల్ని తక్షణమే గుర్తించి తొలగించి, వాటి స్థానంలో నాణ్యమైన మొక్కలతోపాటు నష్ట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆఫ్‌టైప్ మొక్కలకు బాధ్యులుగా నర్సరీలో పని చేసే సిబ్బందిని తొలగించడం అన్యాయమని, తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

ముగిసిన ఇంటర్ 'పాలిటెక్నిక్' పోటీలు


ఓవరాల్ చాంపియన్ షిప్ అందుకుంటున్న కొత్తగూడెం పాలిటెక్నిక్ విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులుగా సాగుతున్న జిల్లాస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. పోటీలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 160 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అబ్దుల్లాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగముని నాయక్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తి చాటారని పేర్కొన్నారు. స్పోర్ట్స్ మీట్‌లో ఓవరాల్ చాంపియన్‌గా కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిలిచింది. ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి రూ.6లక్షల విరాళం


కాకినాడ దాతలకు రశీదు ఇస్తున్న ఈఓ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యాన జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి గురువారం పలువురు భక్తులు విరాళం అందచేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ మాధవనగర్‌కు చెందిన వింజమూరి భాస్కర్‌రావు – ధనలక్ష్మి దంపతులు రూ.5,00,004 విరాళం చెక్కును అధికారులకు అందజేశారు.అలాగే, ఖమ్మం గొల్లగూడెం వాసి ఎస్‌సీహెచ్.కృష్ణమాచార్యులు–రమాదేవి దంపతులు రూ.1,00,116ను ఆలయ ఈఓకి అందజేశాక స్వామిని దర్శించుకున్నారు.

నిందితుడి రిమాండ్

పాల్వంచ: గంజాయి కేసులో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తిని పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన బషీర్ పాత గంజాయి కేసులో పోలీసులకు లొంగిపోయాడు. ఇతనిపై పాల్వంచ, బూర్గంపాడు, కొత్తగూడెంలలో పలు కేసులు ఉన్నాయి.

వ్యాపారి ఐపీ దాఖలు

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని కూలీలైన్ రైతు బజార్ సమీపంలో ఉన్న కిన్నెర ఎంటర్ ప్రైజెస్, హోంనీడ్స్ ఫర్నిచర్ వ్యాపారి హనుమంతు వెంకటరమణ కొత్తగూడెం జిల్లా కోర్టులో గురువారం ఐపీ దాఖలు చేశారు. దాదాపు 56 మందిని ప్రతి వాదులుగా పేర్కొన్నారు. ఫర్నిచర్ వ్యాపారం చేస్తున్న సమయంలో వ్యాపారాభివృద్ధికి 56 మంది నుంచి దాదాపు రూ.4,87,15,000 అప్పు తీసుకున్నాడు. వాటికి వడ్డీ కూడా పెరిగిపోవడంతో బాధితుడు ఐపీ దాఖలు చేశాడు. న్యాయవాదులు జీవీకే మనోహర్, పద్మనాభరావుల ద్వారా ఐపీ దాఖలు చేశాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

'ప్రాక్టికల్స్'పై నిఘా..

- పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఇంటర్ బోర్డు నిర్ణయం
- వచ్చే నెల 3 నుంచి 22 వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు
- జిల్లాలో 54 కళాశాలల్లో కేంద్రాల ఏర్పాటుకు చర్యలు


కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలతోపాటు ప్రాక్టికల్ పరీక్షల్లో కూడా పకడ్బందీగా నిర్వహించేందుకు బోర్డు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రాక్టికల్ పరీక్షలు జరిగే ప్రతి కళాశాల ల్యాబ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా ప్రాక్టికల్ మార్కులు రావాలనే ఉద్దేశంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక ప్రైవేటు కళాశాలల్లో వారే ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఇప్పటికే ఆదేశాలు జారీ చేయగా, యాజమాన్యాలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. సాధారణ పర్యవేక్షణకు సీసీ కెమెరాల ఏర్పాటు, మరమ్మతుల కోసం ఇటీవల ఒక్కో ప్రభుత్వ కళాశాలకు రూ.12 వేలను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. దీంతో నూతన కెమెరాల ఏర్పాటు, మరమ్మతుల పనులు కళాశాలల్లో చేపట్టారు.

పరీక్షలు ఇలా...

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు 102 ఉండగా, ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు 54 కళాశాలలను కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. జనరల్ సబ్జెక్టుల విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీతో పాటు ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. పరీక్ష కేంద్రంలోని ల్యాబ్‌లో మూడు, పరీక్ష పేపర్ డౌన్‌లోడ్ చేసే గదిలో ఒకటి, కళాశాల బోర్డు కనిపించే విధంగా ఎంట్రన్స్‌లో మరో కెమెరా ఏర్పాటు చేయనున్నారు. మొత్తం ఐదు కెమెరాల పర్యవేక్షణలో ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా జరుగనున్నాయి. ఈ ఏడాది ప్రశ్నాపత్రం ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడం, మార్కులు కూడా ఆన్‌లైన్ చేయడం వంటివి చేస్తున్నారు. గతంలో సాదాసీదాగా జరిగిన ప్రాక్టికల్ పరీక్షలు ఈ ఏడాది సీసీ కెమెరాల పర్యవేక్షణలో పారదర్శకంగా జరుగనున్నాయి. దీంతో పాటు మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు నిర్వహించనున్నారు. వీటిని సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నుంచి ప్రాక్టికల్ పరీక్షలను కూడా నిఘా నేత్రాల నడుమ నిర్వహించాలని ఇంటర్మీడియట్ బోర్డు తీసుకున్న నిర్ణయంపై పలువురు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా పరీక్షలు



ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ ఏడాది సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయి. ఈ వారంలో ప్రభుత్వ కళాశాలలో కెమెరాలను ఏర్పాటు చేస్తాం. ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. నిఘా ఉండటంతో పరీక్షల్లో అవకతవకలకు అవకాశం ఉండదు.

–వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి

రసాభాసగా గ్రామసభ

ఎమ్మెల్యే సమక్షంలో బాహాబాహి


వాగ్వాదానికి దిగిన ఇరువర్గాలు

టేకులపల్లి: మండలంలోని తొమ్మిదోమైలుతండాలో జరిగిన గ్రామసభలో రసాభాస నెలకొంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన గ్రామసభలు గురువారం తావుర్యాతండా, చంద్రుతండా, గొల్లపల్లి, మద్రాస్‌తండా, బోడు, రామచంద్రునిపేట, చింతలంక, తొమ్మిదోమైలుతండా, కొత్తతండా(పి) పంచాయతీల్లో నిర్వహించారు. తొమ్మిదోమైలుతండాలో ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతుండగా తమ పేర్లు రాలేదని, అన్యాయం జరిగిందంటూ పలువురు గ్రామస్తులు ప్రశ్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, మాజీ ఎంపీటీసీ బాణోతు పూర్ణ, మాజీ సర్పంచ్ బాణోతు భద్రు తదితరులు ప్రజలకు నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తుండగా బీఆర్‌ఎస్, న్యూడెమోక్రసీ నాయకులు కూడా ప్రశ్నించారు. గ్రామసభకు పీసా కమిటీని ఎందుకు పిలవలేదని, సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ఎస్‌ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది ప్రజలకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపు చేశారు. సభల్లో ఏఓ అన్నపూర్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా శుక్రవారం టేకులపల్లి, దాసుతండా, తడికలపూడి, సులానగర్, కోయగూడెం, కొప్పురాయి, మేళ్ళమడుగు, చింతోనిచెలక, గంగారం పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

అశ్వారావుపేట: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని డీఆర్‌డీఓ, అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. మండలం పరిధిలోని నారంవారిగూడెం కాలనీలో గురువారం నిర్వహించిన గ్రామసభకు ఆమె హాజరై లబ్ధిదారులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత జాబితాలో పేర్లు లేకున్నా తిరిగి దరఖాస్తు చేసుకుంటే అర్హులకు పథకాలు అందుతాయన్నారు. గ్రామసభకు మహిళలు అధిక సంఖ్యలో హాజరు కావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేస్తూ పథకాలలో మహిళల భాగస్వామ్యం అవసరమన్నారు. అనంతరం అశ్వారావుపేటలో అటవీ శాఖ, ఉపాధి హామీ పథకం నర్సరీలను ఆమె సందర్శించారు.

నిబంధనల ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక


లక్ష్మీపురం గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్‌రావు

బూర్గంపాడు: ప్రభుత్వ నిబంధనల మేరకే సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు అన్నారు. గురువారం లక్ష్మీపురంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో వారు మాట్లాడారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఉపాధి హామీ పథకంలో 20 రోజులు పనిచేసిన కూలీలే అర్హులన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. సాగుకు యోగ్యత ఉన్న భూములకు రైతు భరోసా తప్పకుండా అందుతుందన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అధికారులకు వినతిపత్రం అందించి పేదలందరికీ ఆత్మీయ భరోసా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ సునీల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు


చుక్కాలబోడు పాఠశాలలో ఆలస్యంగా విధులకు వస్తున్న ఉపాధ్యాయుడు


జేత్యాతండా పాఠశాలలో విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం జోగ రవి

టేకులపల్లి: మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంలేదు. గురువారం కాంప్లెక్స్ హెచ్‌ఎం రెండు పాఠశాలలను సందర్శించగా ఈ విషయం వెల్లడైంది. కుంటల్ల కాంప్లెక్స్ హెచ్‌ఎం జోగ రవి ఉదయం 9 గంటల తర్వాత చుక్కాలబోడు ప్రాథమిక పాఠశాలకు వెళ్లాడు. ప్రార్థన సమయం అవుతున్నా అక్కడి టీచర్ రాలేదు. విద్యార్థులు ఆడుకుంటూ కనిపించారు. ఆ తర్వాత సమీపంలోనే ఉన్న జేత్యాతండా పాఠశాలను సందర్శించగా, అక్కడ కూడా ఉపాధ్యాయుడు రాలేదు. సుమారు 20 మంది విద్యార్థులు టీచర్ కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో కాంప్లెక్స్ హెచ్‌ఎం విద్యార్థులకు పాఠాలు బోధించి నోట్ పుస్తకాలు చెక్ చేశారు. సమయపాలన పాటించనివైనం వివరణ కోసం కాంప్లెక్స్ హెచ్‌ఎంకు పలుమార్లు ఫోన్ చేయగా వారు స్పందించలేదు. ఈ విషయాన్ని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి దృష్టికి తీసుకెళ్లగా..విచారణ నిర్వహిస్తామని తెలిపారు.

యువతి అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: యువతి అదృశ్యంపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై టి.యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన ఇరవై రెండేళ్ల యువతి బండి లావణ్య ఈ నెల 20వ తేదీ రాత్రి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె తల్లి దమయంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్ట్‌షాపుల్లో తనిఖీలు

పాల్వంచ: పట్టణ పరిధిలోని పలు బెల్ట్‌షాపుల్లో బుధవారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సీఐలు చంద్రశేఖర్ రావు, కృష్ణారెడ్డి, ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. కాగా ఎక్కడా మద్యం పట్టుబడలేదు. ఈ విషయమై సీఐ ప్రసాద్‌ను వివరణ కోరగా.. సాధారణ తనిఖీల్లో భాగంగా పరిశీలించామని, ఎక్కడా ఏమీ పట్టుపడలేదని తెలిపారు.

ఆభరణాలు చోరీ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన కమ్మ రాము ఈ నెల 18న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు రవితేజ వద్దకు వెళ్లారు. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తాళం పగులకొట్టి ఉంది. బీరువాలో పరిశీలించగా 22 గ్రాముల బంగారు ఆభరణాల అపహరించినట్లు గుర్తించారు. ఇంట్లోని స్కూటీని కూడా దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏఎస్సార్ కాలనీలో..

పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీకి చెందిన పద్దం వీరయ్య అశ్వాపురంలో అటవీశాఖ బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం తన భార్యతో కలిసి పాల్వంచలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దీంతో ఇంట్లో ఉన్న బీరువాను పరిశీలించగా రూ.25 వేల నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

సోలార్ వెలుగులు..

- ప్రతీ మండలంలో ఒక మెగావాట్ సామర్థ్యంతో యూనిట్
- మూడు నుంచి ఐదెకరాల స్థలం గుర్తింపునకు సర్వే
- ఉమ్మడి జిల్లాలో 300ఎకరాల సేకరణే లక్ష్యం
- నిర్వహణ బాధ్యతలు మహిళా సంఘాలకు అప్పగింత



నేలకొండపల్లి: థర్మల్, హైడల్ రంగాల్లో విద్యుత్ ఉత్పత్తి నానాటికీ పెరుగుతుండడంతో సోలార్ విద్యుత్ రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో గృహ, వ్యవసాయ అవసరాలకు సోలార్ ప్లాంట్లు అమర్చాలని నిర్ణయించి ఇప్పటికే సర్వే చేయిస్తోంది. ఇవికాక మండలానికి ఒక సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి వివిధ చర్యలు చేపడుతున్న ప్రభుత్వం ఇప్పుడు సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, నిర్వహణలోనూ మహిళలను భాగస్వామ్యులు చేసేలా చర్యలు చేపడుతోంది. పీఎం కుసుమ్ పథకంలో భాగంగా ఖమ్మం ఉమ్మడి జిల్లాలో మండలానికొక ప్లాంట్ ఏర్పాటుచేసి మహిళలకు అప్పగించనుండగా, అవసరమైన భూమి గుర్తించడంలో రెవెన్యూ, విద్యుత్ అధికారులు నిమగ్నమయ్యారు.

సబ్‌స్టేషన్‌కు ఐదు కి.మీ. లోపల

జిల్లా వ్యాప్తంగా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేయనుండగా అవసరమైన భూమిని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మూడు నుంచి ఐదు కిలోమీటర్ల లోపల గుర్తించాల్సి ఉంటుంది. తద్వారా ప్లాంట్ నుంచి సబ్‌స్టేషన్‌కు లైన్ వేయడం సులువవుతుందని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 300 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తించాలని ఆదేశాలు అందాయి. ప్రభుత్వ భూములను సర్వే చేసి నివేదిక ఇచ్చాక యూనిట్ల ఏర్పాటులో సాంకేతిక సమస్యలు రాకుండా మరోమారు పరిశీలించాల్సి ఉంటుంది. ఈ సర్వే బృందాల్లో ఎన్పీడీసీఎల్, రెవెన్యూ, టీఎస్ రెడ్కో అధికారులు ఉంటారు. వీరు కూడా నివేదిక ఇచ్చాక ఆసక్తి ఉన్న మహిళా సంఘాల గుర్తించి బ్యాంకర్లతో రుణాలు ఇప్పించడంపై దృష్టి సారిస్తారు.

మండలానికో యూనిట్

ప్రస్తుతం పైలట్ ప్రాజెక్ట్ కింద మండలంలో ఒక మెగావాట్ సామర్థ్యంతో యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం ఏర్పాటుచేసే ప్లాంట్లకు 300 ఎకరాల భూమి అవసరమవుతుందని అంచనా. ఒక మెగావాట్ యూనిట్ ఏర్పాటుకు మూడెకరాల భూమి అవసరమని, ఆపై యూనిట్ ఏర్పాటుకు దాదాపు రూ.3 కోట్ల వరకు వ్యయమవుతుందని సమాచారం. ఈ నగదును మహిళా సంఘాలకు రుణంగా ఇప్పించి ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ఆపై మహిళా సంఘాలు అందే నగదుతో రుణం తీరుస్తూనే వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

మరో విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, డైరెక్టర్ లక్ష్మయ్య తదితరులు

పాల్వంచ: పాల్వంచలో పాత ఓఅండ్ఎం కర్మాగారం తీసేవేసిన స్థానంలో మరో విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో గురువారం ఆయన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగూడెంలో ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు సర్వే పూర్తయిందని, కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్‌ను కలిపి కార్పొరేషన్ ఏర్పాటుతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పవర్ ప్లాంట్ తీసేయడంతో అనేక మంది ఉద్యోగులు, కార్మికులు వెళ్లిపోవడం బాధాకరమని, మళ్లీ పూర్వవైభవం కోసం కృషి చేస్తామని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తిలో ఇంజనీర్ల పాత్ర కీలకమైందన్నారు. జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ జెన్‌కోలో సిబ్బంది కొరత ఉన్నా లక్ష్యాలను మాత్రం ఎక్కడా తగ్గకుండా రికార్డ్ స్థాయిలో ఉత్పత్తి సాధించడం వెనుక ఇంజనీర్ల కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్ రావు, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు శివాజీ, రీజనల్ సెక్రటరీలు ఎండి.సమీర్ అహ్మద్, రామకృష్ణజాదవ్, సెంట్రల్ కమిటీ నాయకులు తిరుపతయ్య, ప్రవీణ్‌కుమార్, పున్నానాయక్, హరీష్, అనిల్ కుమార్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్‌సీఓ తనిఖీ

కొణిజర్ల: మండల పరిధి తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను గురుకులాల ఆర్‌సీఓ కె.నాగార్జునరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి బోధన, వసతులపై ఆరా తీసిన ఆయన పరిసరాలు వంటగది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ఆతర్వాత బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమైన ఆర్‌సీఓ విద్యార్థినులకు మెనూ ఆధారంగా భోజనం సమకూరుస్తూనే మెరుగైన బోధన అందించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రజిత, అధ్యాపకులు కే.పీ.ఐశ్వర్య, కె.రజిని, బి.రాజేశ్వరి పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: భార్యను వేధిస్తున్న వ్యక్తిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై టీ. యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన గుత్తి మారేశ్వరికి కోయ రంగాపురం గ్రామానికి చెందిన సురేష్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. అదనపు కట్నం కావాలని, సంతానం లేరని కొంతకాలంగా సురేష్ తన భార్యను వేధిస్తున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆస్పత్రిలో చికిత్స పొందాక బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కారు డ్రైవర్‌పై..

పాల్వంచరూరల్: రోడ్డు ప్రమాద ఘటనలో కారు డ్రైవర్‌పై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురం శివారు బీసీఎం జాతీయ రహదారిపై బూర్గంపాడు ఎస్సీకాలనీకి చెందిన బర్ల శివనారాయణ ఈ నెల 16న ద్విచక్రవాహనంపై పాల్వంచకు వస్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడు కిందపడి గాయపడ్డాడు. బాధితుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ చల్లపల్లి నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

వైరా: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ వివాహిత గురువారం వైరా రిజర్వాయర్‌లో దూకే యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. కొణిజర్ల మండలం గుబ్బగుర్తికి చెందిన మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి రిజర్వాయర్ ఆనకట్టపైకి చేరుకుని ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు తన సోదరికి ఫోన్ ద్వారా తెలిపింది. దీంతో ఆమె సోదరి డయల్ 100కు ఫోన్ చేయగా వైరా పోలీసులు హుటాహుటిన చేరుకుని మహిళను నిలువరించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాగా, ఆమె తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన తన భర్త వేధింపులతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పగా కుటుంబీకులను పిలిచి కౌన్సెలింగ్ అనంతరం అప్పగించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

దుమ్ముగూడెం : మండలంలోని చిన్న బండిరేవు గ్రామానికి చెందిన బాధ వసంత్ రెడ్డి (22)వ్యక్తిగత కారణాలతో మనస్తాపం చెంది గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన వసంత్ రెడ్డి బుధవారం రాత్రి తన తల్లి చీర తీసుకుని వెళ్తుండగా, చీర ఎందుకని సోదరి ప్రశ్నించింది. బైక్ శుభ్రం చేసుకునేందుకంటూ చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి రాలేదు. పర్ణశాల పంచాయతీ ముసలిమడుగు గ్రామంలోని గోదావరి కరకట్ట సమీపంలో చెట్టుకు చీరతో ఉరి వేసుకుని మృతి చెందాడు. గురువారం ఉదయం గమనించిన గ్రామస్తులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటప్పయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మంచుకురిసే వేళలో..


లక్ష్మీనగరంలో మంచుతో కప్పేసిన రహదారి

మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి విపరీతంగా మంచు కురిసింది. ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగమంచు పట్టడంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించారు. మంచు కురిసే సమయంలో కొందరు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ ఎంజాయ్ చేశారు.

– దుమ్ముగూడెం



● ఇంగ్లీష్ ఇడియమ్స్

లెట్ ది డస్ట్ సెటిల్

ఒక సంక్షోభం తరువాత లేదా గందరగోళం తరువాత వచ్చే సమయం కోసం ఎదురుచూసే సందర్భంలో వాడే మాట...లెట్ ది డస్ట్ సెటిల్.

ఉదా: ది కంపెనీ ఈజ్ ఫేసింగ్ క్రిటిసిజమ్ నౌ, బట్ దే ఆర్ వెయిటింగ్ టు లెట్ ది డస్ట్ సెటిల్ బిఫోర్ మేకింగ్ ఏ స్టేట్‌మెంట్

● మ్యూజిక్ వరల్డ్

మదిని దోచేలా మైమరచి పోయేలా!



అమెరికన్ సింగర్–సాంగ్ రైటర్ గ్రేసీ అబ్రామ్స్ రాసిన పాట 'దట్ ఈజ్ సో ట్రూ' బిల్‌బోర్డ్ జాబితాలో అగ్ర స్థానంలో ఉంది. ఇది గ్రేసీ రెండవ ఆల్బమ్. అమెరికాకు వెలుపల ఆస్ట్రేలియా, బెల్జియం, న్యూజీలాండ్, నార్వే, యూనైటెడ్ కింగ్ డమ్, ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, నెదర్లాండ్స్, స్వీడన్, స్విట్జర్లాండ్‌లో మ్యూజిక్ చార్ట్‌లలో అగ్ర స్థానంలో నిలిచింది. 'ఐ కుడ్ గో అండ్ రీడ్ యువర్ మైండ్' అని హుషారెత్తిస్తోంది. ఆ సందడిలో మీరు భాగం కావాలంటే....'దట్ ఈజ్ సో ట్రూ' ఒక్కసారి వినేయండి. 'షీ ఈజ్ సో కూల్' అంటూ గ్రేసీతో గొంతు కలపండి.

● గేమింగ్

స్పైడర్–మ్యాన్ మరోసారి...

గ్రేట్ సూపర్ హీరోలా సాహసాలు ఎప్పుడూ సూపర్‌గానే ఉంటాయి. దీనికి ఉదాహరణ... స్పైడర్–మ్యాన్!

ఒక్క ముక్కలో చెప్పాలంటే స్పైడర్–మ్యాన్ గేమ్స్ ఎన్నో సాహసాలకు కేరాఫ్ అడ్రస్. 'మార్వెల్స్ స్పైడర్–మ్యాన్ 2' యాక్షన్ అడ్వెంచర్ గేమ్. మార్వెల్ కామిక్స్ క్యారెక్టర్ 'స్పైడర్–మ్యాన్' ఆధారంగా రూపొందించిన గేమ్ ఇది. థర్డ్ పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే ఈ గేమ్‌లో పీటర్ పార్కర్, మైకేల్ మోరేల్స్ ప్రధాన పాత్రలు. న్యూయార్క్ కేంద్రంగా సాగే ఈ ఆటలో ప్లేయర్స్ రకరకాల స్పైడర్–మ్యాన్ సూట్‌లను సేకరించవచ్చు.

సమస్త సాహసాలతో గేమింగ్ కమ్యూనిటీని ఆకట్టుకునే 'మార్వెల్స్ స్పైడర్–మ్యాన్' ఈ నెల చివర రానుంది.



సిరీస్: మార్వెల్స్ స్పైడర్–మ్యాన్
ప్లాట్‌ఫామ్స్: విండోస్
జానర్: యాక్షన్–అడ్వెంచర్
మోడ్: సింగిల్–ప్లేయర్

● రికార్డ్



ప్రయాణ ప్రేమికుడు, ప్రఖ్యాత పర్వతారోహకుడు సర్ మార్టిన్ కాన్వే 'అధిరోహించిన ప్రతి శిఖరం ఏదో ఒకటి నేర్పుతుంది' అంటారు. అలా చిన్న వయసులోనే ఎన్నో శిఖరాల ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకుంది విశాఖపట్నానికి చెందిన కామ్య కార్తికేయన్. పదహారేళ్లకే ఎవరెస్ట్ అధిరోహించి రికార్డ్ సృష్టించింది. తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసిన యంగెస్ట్ ఫిమేల్‌గా రికార్డు సృష్టించింది....

కామ్య... అఖండ ఖ్యాతి

ఇలా మొదలైంది...

కార్తికేయన్, లావణ్య దంపతులకు సాహస యాత్రలు ఇష్టం. తమ చిన్నారి కామ్యను భుజాలపై మోసుకుంటూనే ట్రెక్కింగ్‌కు వెళుతుండేవారు. అలా పర్వత శిఖరాలతో చిన్నవయసులోనే కామ్యకు పరిచయం అయింది. మూడేళ్ల వయసులోనే ముంబైలోని లోనావాలాలో తండ్రితో పాటు ట్రెక్కింగ్‌లో పాల్గొని 'శభాష్' అనిపించుకుంది. మహారాష్ట్రలోని డ్యూక్స్ నోస్, రాజ్‌గడ్ పర్వతాల్ని నాలుగేళ్ల వయసులో తల్లిదండ్రులతో పాటు అధిరోహించింది.

తల్లికి తగిన తనయ...

హిమాలయాల ట్రెక్కింగ్‌కు తల్లితో పాటు వెళ్లింది కామ్య. అప్పుడు ఆమె వయసు ఏడేళ్లు. తల్లీ కూతుళ్లు మొదటి ప్రయత్నంలోనే 12 వేల అడుగుల ఎత్తైన చంద్రశీల పర్వతారోహణ చేశారు. ఆ తర్వాత హిమాలయ పర్వత శ్రేణుల్లో ఒకటైన 13,500 అడుగుల ఎత్తైన హర్‌కిదమ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. అది పూర్తి చేసిన కొద్ది రోజుల్లోనే 13,500 అడుగుల ఎత్తైన కేదార్‌కంఠ పర్వతారోహణ చేశారు. తొమ్మిదేళ్ల వయసులో హిమాలయాల్లో రూప్‌కుండ్ ట్రెక్కింగ్ చేసి రికార్డు సృష్టించింది కామ్య.

ఏడు ఖండాల్లో ఎన్ని రికార్డ్‌లో!

● దక్షిణ అమెరికాలో 22,837 అడుగుల ఎత్తైన మౌంట్ అకాన్‌కాగువాని అధిరోహించి ఈ శిఖరాన్ని అధిరోహించిన తొలి బాలికగా ప్రపంచ రికార్డు సృష్టించింది ● ఆఫ్రికా ఖండంలో అత్యంత ఎత్తైన 18,652 అడుగుల మౌంట్ కిలిమంజారోపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించి ఈ శిఖర యాత్ర పూర్తి చేయించడం ద్వారా ఆసియాలోనే అతి పిన్న వయస్కురాలిగా రికార్డు ● యూరప్ ఖండంలోని అత్యంత ఎత్తైన 18,510 అడుగుల మౌంట్ ఎల్‌బ్రస్‌ని అధిరోహించి యంగెస్ట్ గర్ల్ ఇన్‌ది వరల్డ్‌గా రికార్డు ● ఆస్ట్రేలియా ఖండంలోని అతి ఎత్తైన మౌంట్ కాజియాస్కోని అధిరోహించిన రెండో బాలికగా రికార్డు ● ఉత్తర అమెరికాలోని 20,308 అడుగుల మౌంట్ డెనలీని అధిరోహించిన యంగెస్ట్ నాన్ అమెరికన్‌గా రికార్డు ● ఆసియా ఖండంలో అత్యంత ఎత్తైన 29,031 అడుగుల మౌంట్ ఎవరెస్ట్‌ని అధిరోహించి నేపాల్ వైపు నుంచి ఎవరెస్ట్‌ని అధిరోహించి ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా, తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి, ప్రపంచంలోనే అతి పిన్నవయస్కురాలిగా రికార్డ్ సృష్టించింది.

ఆల్ రౌండర్

ముంబై నేవీ స్కూల్‌లో ప్లస్‌టు చదువుతున్న కామ్య కార్తికేయన్ పర్వతారోహణలోనే కాదు చదువులోనూ ప్రతిభ కనబరుస్తోంది. ప్రతి పరీక్షలోనూ ఫస్ట్ గ్రేడ్ సాధిస్తోంది. సంగీతంలోనూ ప్రావీణ్యం పొందిన కామ్య పియానో వాయిద్యానికి సంబంధించి 3 గ్రేడులు పాసైంది. కర్ణాటక సంగీతం, భరతనాట్యంలోనూ 'ఆహా' అనిపించేలా ప్రతిభ చూపుతోంది.

ప్రధాని మన్ కీ బాత్‌లో కామ్య...

'అవరోధాల్ని అధిగమించి మన ఖ్యాతిని ఖండాంతరాల్లో ఇనుమడింపజేయాలి అనుకునేవారికి విశాఖ నగరానికి చెందిన కామ్య కార్తికేయన్ అనే చిన్నారి స్ఫూర్తినిచ్చింది' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ కామ్యను ప్రశంసించారు. దక్షిణ అమెరికాలోని అత్యంత ఎత్తైన అకాన్కాగువా పర్వతాన్ని అధిరోహించిన సమయంలో మన్‌కీ బాత్‌లో కామ్య ప్రస్తావన తీసుకువచ్చారు మోదీ.

– కరుకోల గోపీకిశోర్‌రాజా, సాక్షి, విశాఖపట్నం

ప్రతి అడుగూ సవాల్‌గా స్వీకరించాను

సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసి భారత త్రివర్ణపతాకాన్ని ఏడు ఖండాల్లోనూ రెపరెపలాడించాలన్నదే అమ్మా నాన్నల కల. వారి ఆకాంక్ష నెరవేర్చినందుకు గర్వంగా ఉంది. ఒకానొక సమయంలో మా పేరెంట్స్ తమ సంపాదనంతా నా మీదే ఖర్చు చేశారు. కొందరు దాతలు సహకారం అందించి నన్ను ముందుకు నడిపించారు. ఎంతటి కష్టాన్నైనా అవలీలగా ఎదుర్కోవాలన్నది నాన్న దగ్గర నేర్చుకున్నాను.

– కామ్య కార్తికేయన్

యువర్స్

● టెక్.. టాక్

ఇన్‌స్టాలో ఎడిట్ యాప్



స్మార్ట్‌ఫోన్‌లలో షార్ట్ వీడియో క్రియేషన్ సరికొత్త స్థాయికి చేరుకుంది. క్రియేటర్స్‌కు దగ్గరైన ప్లాట్‌ఫామ్‌లలో ఇన్‌స్టాగ్రామ్ ఒకటి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఐఫోన్‌ల కోసం 'ఎడిట్' యాప్‌ను ప్రకటించింది ఇన్‌స్టా.

'అధిక నాణ్యతతో వీడియోను రికార్డ్ చేయడానికి, మీరు కోరుకునే అన్ని ఎడిటింగ్ సాధనాలు, ఫ్రెండ్స్‌తో పాటు ఇతర క్రియేటర్‌లతో డ్రాఫ్టను షేర్ చేసే సామర్థ్యం ఎడిట్‌లో ఉంటాయి. ఎడిట్ అనేది క్రియేటివ్ టూల్స్ సమాహారం' అని ప్రకటించాడు ఇన్‌స్టాగ్రామ్ హెడ్ ఆడమ్ మొస్సేరి.

'ఎడిట్స్' యాప్‌ను ఉపయోగించడం వల్ల యూజర్‌లు వాటర్ మార్క్ లేకుండా వీడియోలను ఎక్స్‌పోర్ట్ చేయడానికి, వీడియోల పనితీరును విశ్లేషించడానికి...మొదలైన వాటికి ఉపయోగపడుతుంది. ఈ యాప్ 2కె రిజల్యూషన్ నుంచి 60 ఎఫ్‌పిఎస్ వరకు హెచ్‌డీఆర్, ఎస్‌డీఆర్ ఫార్మట్‌లో ఎడిటింగ్ వీడియోలను సపోర్ట్ చేస్తుంది.

ఇక మూడు నిమిషాలు!



యూట్యూబ్ షార్ట్స్ మాదిరిగానే మూడు నిమిషాల నిడివి గల వీడియోలను ప్లాట్‌ఫామ్‌లో అప్లోడ్ చేయవచ్చని తెలియజేసింది ఇన్‌స్టాగ్రామ్. గతంలో 90 సెకన్‌ల వరకు వీడియోలను అప్లోడ్ చేసే అవకాశం కల్పించింది ఇన్‌స్టాగ్రామ్.

'ఇక నుంచి మీరు మూడు నిమిషాల నిడివి గల రీల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లో లాంగ్–ఫామ్ వీడియోలపై కాకుండా షార్ట్–ఫామ్ వీడియోలపై దృష్టి పెట్టాలనుకున్నాం. కానీ 90 సెకనులు చాలా తక్కువ సమయం అని క్రియేటర్‌ల నుంచి ఫీడ్‌బ్యాక్ వచ్చింది. పెంచిన సమయం వల్ల మీరు మరిన్ని స్టోరీలను షేర్ చేయవచ్చు' అని ఇన్‌స్టాగ్రామ్ ప్రకటించింది.



ఏసర్ స్విఫ్ట్ జో 14

స్క్రీన్ సైజ్: 14 అంగుళాలు
స్క్రీన్ రిజల్యూషన్: 2880×1800 పిక్సెల్స్
డైమెన్షన్స్: 312.9×217.9×14.9 ఎంఎం
బరువు: 1.25 కేజీ

ఓపెన్ ఏఐ టాస్క్స్



'**టాస్క్స్**' అనే న్యూ చాట్‌జీపీటి కేపబిలిటీతో ముందుకురానుంది ఓపెన్ ఏఐ. ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. అలారం సెట్ చేయడం, ప్రజెంటేషన్ ఇవ్వడానికి అవసరమైన రాబోయే సమావేశాన్ని గుర్తు చేయడంలాంటి పనులను చేయగలదు. నీరు తాగడం నుంచి గ్రాసరీ షాపింగ్ వరకు ఎన్నో విషయాలలో 'టాస్క్స్' ద్వారా రిమైండర్స్ సెట్ చేసుకోవచ్చు.

సాక్షి సినిమా

హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్

– వెంకటేశ్



● భీమ్స్, వెంకటేశ్, అనిల్ రావిపూడి

''సంక్రాంతి పండగకి నిజాయతీగా ఓ ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనుకున్నాం. ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని ఆదరించారు. హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్ అంటున్నారు. మా సినిమాకి ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని హీరో వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలైంది. గురువారం చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ– ''అనిల్‌తో నేనో ఫ్రెండ్‌లానే ఉంటాను. మేము చాలా ఎంజాయ్ చేస్తూ వర్క్ చేస్తాం.. అందుకే రిజల్ట్ ఇంత పాజిటివ్‌గా ఉంటుంది. ఇక నా సినిమా ఇన్ని కోట్లు వసూలు చేయాలని నేనెప్పుడూ అడగను... వచ్చింది తీసుకోవాలి. ఇప్పటికే మా సినిమా రూ. 230 కోట్లు వసూలు చేయడం అనేది బోనస్.. ఇంతకంటే ఏం కావాలి'' అన్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ–''సినిమాకి కాస్త దూరమైన ప్రేక్షకులు కూడా మా 'సంక్రాంతికి వస్తున్నాం' కోసం థియేటర్‌కి రావడం ఆనందంగా ఉంది. రెవెన్యూ సైడ్ కూడా మేం ఊహించినదానికంటే అద్భుతంగా రావడం హ్యాపీ'' అని చెప్పారు. ''వెంకటేశ్‌గారి 'కలిసుందాం రా' సినిమా పాటలని ప్రేక్షకులు ఎంత గుండెల్లో పెట్టుకున్నారో... 'సంక్రాంతికి వస్తున్నాం' సాంగ్స్‌ని కూడా అదే స్థాయిలో ఆస్వాదించడం సంతోషంగా ఉంది'' అని సంగీత దర్శకుడు భీమ్స్ అన్నారు.

లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది

– విశ్వక్ సేన్



● సాహు గారపాటి, విశ్వక్ సేన్, రామ్ నారాయణ్

''నా కెరీర్‌లో యాక్షన్ టచ్‌తో రూపొందిన ఔట్ అండ్ ఔట్ కామెడీ ఫ్యామిలీ ఫిల్మ్ 'లైలా'. చాలా క్లీన్‌గా ఉంటుంది. ప్రేక్షకులంతా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా కోసం లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది. నిజంగా అమ్మాయిలకు హ్యాట్సాఫ్ చెప్పాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో విశ్వక్ సేన్, ఆకాంక్షా శర్మ జంటగా నటించిన చిత్రం 'లైలా'. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఇచ్చుకుందాం బేబీ...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. పూర్ణాచారి సాహిత్యం అందించిన ఈ పాటని ఆదిత్య ఆర్కే, ఎంఎం మానసి ఆలపించారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''లైలా'లో మోడల్ సోనూ, లైలా అనే రెండు పాత్రల్లో నటించా'' అన్నారు. ''లైలా' కథ ఇద్దరు ముగ్గురు హీరోలకు చెప్పాను. లేడీ గెటప్ వేయడం అంత ఈజీ కాదు. సినిమా అంటే పిచ్చి ఉంటేనే చేయగలరు. అలాంటి పిచ్చి ఉన్న విశ్వక్ దొరికారు'' అని రామ్ నారాయణ్ చెప్పారు. ''ఈ పాత్ర విశ్వక్ కెరీర్‌లో నిలిచిపోతుంది'' అన్నారు సాహు గారపాటి. పాటల రచయిత పూర్ణాచారి మాట్లాడారు.



● సాయిపల్లవి, నాగచైతన్య

హైలెస్సో హైలెస్సా

'హైలెస్సో హైలెస్సా...' అంటూ ఆడి పాడేస్తున్నారు నాగచైతన్య, సాయిపల్లవి. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య, సాయి పల్లవి జోడీగా నటించిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 7న విడుదల కానుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'హైలెస్సో హైలెస్సా... నీవైపే తెరచాపని తిప్పేసా...' అంటూ సాగే మూడో పాటని గురువారం రిలీజ్ చేశారు. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటని శ్రేయా ఘోషల్, నకాష్ అజీజ్ పాడారు. ''మోస్ట్ ఎవైటెడ్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'తండేల్'. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'బుజ్జి తల్లి..', 'నమో నమః శివాయ...' పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. వండర్‌ఫుల్ మెలోడీస్‌ని కంపోజ్ చేయడంలో మాస్టర్ అయిన దేవిశ్రీ ప్రసాద్ తాజాగా 'హైలెస్సో హైలెస్సా..' అంటూ సాగే మరొక లవ్ మెలోడీని కంపోజ్ చేశారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఉత్తమ చిత్రం: అనోరా, ది బ్రూటలిస్ట్, ఎ కంప్లీట్ అన్‌నోన్, కాన్‌క్లేవ్, డ్యూన్: పార్ట్ 2, ఎమిలియా పెరెజ్, ఐయామ్ స్టిల్ హియర్, నికెల్ బాయ్స్, ది సబ్‌స్టాన్స్, విక్డ్ ● **ఉత్తమ దర్శకుడు:** సీన్ బేకర్ (అనోరా), బ్రాడీ కార్బెట్ (ది బ్రూటలిస్ట్), జేమ్స్ మ్యాన్‌గోల్డ్ (ది కంప్లీట్ అన్‌నోన్), జాక్వెస్ ఆడియార్డ్ (ఎమిలియా పెరెజ్), కోరలీ ఫార్గేట్ (ది సబ్‌స్టాన్స్) ● **ఉత్తమ నటుడు:** అడ్రియాన్ బ్రాడీ (ది బ్రూటలిస్ట్), తిమోతీ చాలమెట్ (ది కంప్లీట్ అన్‌నోన్), కోల్‌మెన్ డొమినింగో (సింగ్‌సింగ్), రే ఫియన్నెస్ (కాన్‌క్లేవ్), సెబస్టియన్ స్టాన్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ నటి:** సింథియా ఎరివో (విక్డ్), కార్లా సోఫియా గాస్కన్ (ఎమిలియా పెరెజ్), మికే మాడిసన్ (అనోరా), డెమి మూర్ (ది సబ్‌స్టాన్స్), ఫెర్నాండా టోర్రెస్ (ఐ యామ్ స్టిల్ హియర్) ● **ఉత్తమ సహాయ నటుడు:** యురా బోరిసోవ్ (అనోరా), కిరెన్ కల్కిన్ (ది రియల్ పెయిన్), ఎడ్వర్డ్ నార్టన్ (ది కంప్లీట్ అన్‌నోన్), గాయ్ పియర్స్ (ది బ్రూటలిస్ట్), జెరీమీ స్ట్రాంగ్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ సహాయ నటి:** మోనికా బార్బరో (ది కంప్లీట్ అన్‌నోన్), అరియానా గ్రాండే (విక్డ్), ఫెలిసిటీ జోన్స్ (ది బ్రూటలిస్ట్), ఇసబెల్లా రోస్సెల్లిని (కాన్‌క్లేవ్), జోయా సాల్డానా (ఎమిలియా పెరెజ్).



● కార్లా సోఫియా గ్లాస్కాన్

97వ ఆస్కార్ అవార్డ్ నామినేషన్స్ ప్రకటన

ఆస్కార్ సంబరం ఆరంభం






● 13 నామినేషన్లతో నాన్ ఇంగ్లీష్ మూవీ 'ఎమిలియా పెరెజ్' రికార్డ్
● 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు 10 నామినేషన్స్
● ట్రాన్స్‌జెండర్‌కి దక్కిన తొలి నామినేషన్ ● ఇండియన్ షార్ట్ ఫిల్మ్‌కి నామినేషన్

97వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఈ ఏడాది మార్చి 2న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఘనంగా జరగనుంది. కాగా ఈ అవార్డులకు సంబంధించిన నామినేషన్లను గురువారం రాత్రి (భారతీయ కాలమానం ప్రకారం) ప్రకటించారు. అమెరికన్ నటుడు బోవెన్ యాంగ్, నటి రాచెల్ సెన్నాట్‌లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. అయితే ఈ నామినేషన్ల ప్రకటన ఈ నెల 17న జరగాల్సింది. కానీ అమెరికాలో చెలరేగిన కార్చిచ్చు కారణంగా 19కి వాయిదా వేశారు. ఫైనల్‌గా 23న ప్రకటించారు.

రికార్డ్ సాధించిన స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్

ఈసారి స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్ మూవీ 'ఎమిలియా పెరెజ్' నాన్–ఇంగ్లీష్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని రికార్డ్ సాధించింది. గతంలో చైనా మూవీ 'క్రౌచింగ్ టైగర్ హిడెన్ డ్రాగన్', మెక్సికన్–అమెరికన్ డ్రామా 'రోమా'... ఈ రెండు చిత్రాలు నాన్–ఇంగ్లీష్ విభాగంలో పది నామినేషన్లు దక్కించుకున్నాయి. ఇప్పుడు 13 నామినేషన్లతో 'ఎమిలియా పెరెజ్' వాటిని అధిగమించింది. అలాగే ఈ చిత్రంలో ఓ లీడ్ రోల్‌లో నటించిన స్పానిష్ నటి కార్లా సోఫియా గాస్కాన్ (బెస్ట్ యాక్ట్రస్ లీడ్ రోల్ నామినేషన్) చరిత్ర సృష్టించారు. ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయిన తొలి ట్రాన్స్‌జెండర్ నటిగా నిలిచారామె. ఇంకా 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు పది నామినేషన్ల చొప్పున దక్కాయి. అంతగా అంచనాలు లేని 'కాన్‌క్లేవ్' మూవీకి 8 నామినేషన్లు దక్కడం ఓ విశేషం.

ఒక్క నామినేషన్ తేడాతో... నాన్ ఇంగ్లీష్ ఫిల్మ్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని, రికార్డు సాధించిన 'ఎమిలియా పెరెజ్'కి ఇంకో నామినేషన్ దక్కి ఉంటే... ఇంగ్లీష్ ఫిల్మ్‌ల రికార్డుని కూడా అధిగమించి ఉండేది. 'టైటానిక్, ఆల్ అబౌట్ ఈవ్, లా లా ల్యాండ్' వంటి ఇంగ్లీష్ చిత్రాలు 14 నామినేషన్లు దక్కించుకున్నాయి.



తల్లి హిస్టరీ రిపీట్: 'ఐయామ్ స్టిల్ హియర్' చిత్రానికి గాను ఫెర్నాండా టోర్రెస్ ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్నారు. ఇందులో విశేషం ఏంటంటే... ఆమె తల్లి ఫెర్నాండా మోంటెనెగ్రో 1991లో 'సెంట్రల్ స్టేషన్' చిత్రానికి గాను ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్న తొలి బ్రెజిలియన్ నటిగా రికార్డుని సాధించారు. ఇప్పుడు ఇన్నేళ్లకు మలి బ్రెజిలియన్ నటిగా టోర్రెస్ నామినేషన్ దక్కించుకుని తల్లి హిస్టరీని రిపీట్ చేశారు.

బరిలో ఇండియన్ షార్ట్ ఫిల్మ్: ఆడమ్ జే గ్రేవ్స్ దర్శకత్వం వహించిన 'అనూజ' బెస్ట్ షార్ట్ ఫిల్మ్ (లైవ్ యాక్షన్) విభాగంలో నామినేషన్ దక్కించుకుంది. ఆల్రెడీ రెండు ఆస్కార్ అవార్డులు సాధించిన భారతీయ నిర్మాత గునీత్ మోంగా ఈ చిత్రానికి ఓ నిర్మాత కావడం విశేషం. అలాగే నటి ప్రియాంకా చోప్రా ఓ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఢిల్లీలోని ఓ గార్మెంట్ ఫ్యాక్టరీలో పని చేసే తొమ్మిదేళ్ల అనూజ స్కూల్‌కు వెళ్లాలనుకుంటుంది. ఆ నిర్ణయం ఆమె జీవితాన్ని, అనూజ సోదరి పాలక్ భవిష్యత్‌ను ఏ విధంగా ప్రభావితం చేసింది? అనే కోణంలో ఈ చిత్రం సాగుతుంది. అనూజగా సజ్దా పఠాన్, పాలక్‌గా అనన్య షాన్‌భాగ్ నటించారు. ఇదిలా ఉంటే... గునీత్ మోంగా ఓ నిర్మాతగా వ్యవహరించిన 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కి గాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో 2023లో ఆస్కార్ దక్కింది. అంతకుముందు 2021లో గునీత్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన 'పీరియడ్: ఎండ్ ఆఫ్ సెంటెన్స్'కిగాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో అవార్డు దక్కింది. ఇప్పుడు ఆమె ఓ నిర్మాతగా వ్యవహరించిన 'అనూజ'కు కూడా ఆస్కార్ దక్కుతుందా? అనేది చూడాలి.

భారతీయ సినిమాకి నిరాశ

ఆస్కార్ అవార్డ్స్ రిమైండర్ లిస్ట్‌లో నిలిచిన భారతీయ చిత్రాలు 'కంగువ, ఆడు జీవితం ('ది గోట్ లైఫ్), సంతోష్, స్వతంత్రవీర్ సవార్కర్, ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్, గర్ల్స్ విల్ బీ గర్ల్స్, పుతల్' ఆస్కార్ నామినేషన్‌ను దక్కించుకోలేకపోయాయి. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్ కోసం ఈ ఏడాది ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పంపిన హిందీ చిత్రం 'లాపతా లేడీస్' ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లోనూ చోటు దక్కించుకోలేకపోయిన విషయం తెలిసిందే. ఇలా ఈసారి భారతీయ సినిమాకి నిరాశ ఎదురైంది.